ప్రజాశక్తి

గురువారం 13 ఏప్రిల్ 2023





డ్రోన్ సర్వే చేపడుతున్న సిబ్బంది

రీసర్వేకు శ్రీకారం

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపాలిటీలో రీసర్వేలో భాగంగా బుధవారం డ్రోన్ కెమెరాతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. టౌన్ ప్లానింగ్ అధికారి రామకృష్ణ పర్యవేక్షణలో డ్రోన్ ఆపరేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

గిరిజన అభివృద్ధికి కృషి

ఐటిడిఎ నూతన పిఒ కల్పనా కుమారి

ప్రజాశక్తి-సీతంపేట



ఐటిడిఎ పిఒగా బాధ్యతలు చేపట్టిన కల్పనా కుమారి

ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి అన్నారు. బుధవారం సీతంపేట ఐటిడిఎ పిఒగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఐటిడిఎ పిఒ బాధ్యతలు ఒక వరంగా భావిస్తానన్నారు. ఐటిడిఎ పరిధిలోని అన్ని శాఖలపై ప్రత్యేక దృష్టి పెడతానని, అధికారులు కార్యాలయ సమయంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. స్థానిక వనరులపై అధ్యయనం చేసి, గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం పక్కాగా అమలయ్యేలా చూస్తానన్నారు. ఏజెన్సీలో సారా నిర్మూలనకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి దశల వారీగా అరికడతామన్నారు. గిరిజన సహకార సంస్థ ద్వారా గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయడానికి డిఆర్ డిపోల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. తాగునీరు, ప్రాథమిక విద్య, రహదారులు వంటి మౌలిక సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటానని వివరించారు. సచివాలయాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తానని చెప్పారు. ముందుగా నూతన పిఒ.. ఎపిఒ రోసిరెడ్డి, డిడి బి.నగేష్, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మార్గనిర్దేశం చేశారు.

పాచిపెంటలో టిడిపి

- మండల సమావేశం నిర్వహించిన పిన్నింటి
- పార్టీ అధ్యక్షుడు సూర్యనారాయణేనన్న సంధ్యారాణి
- అధిష్టానం ఆదేశాల మేరకే నిర్వహణ : ప్రసాద్‌బాబు
- తాజా పరిణామాలపై అధిష్టానం ఆరా



మండల నాయకులతో పిన్నింటి ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి-సాలూరు, పాచిపెంట

పాచిపెంట మండలంలో టిడిపిలో గ్రూపుల పోరు మరోసారి బయట పడింది. మాజీ ఎంపిపి పిన్నింటి ప్రసాద్‌బాబు బుధవారం టిడిపి మండల సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో తన బలమేంటో ప్రదర్శన చేసి చూపించారు. జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావుతో కలిసి నిర్వహించిన సమావేశానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణిని కూడా ఆహ్వానించారు. అయితే ఆమె ఈ సమావేశానికి హాజరు కాలేదు. టిడిపి మండల అధ్యక్షులు ముఖి సూర్యనారాయణే అని ఆమె స్పష్టంచేశారు. ముఖి సూర్యనారాయణ నిర్వహించే మండల సమావేశాలకు మాత్రమే నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆమె పార్టీ వాట్సాప్ గ్రూపులో ఆదేశించారు. కొద్దిరోజుల క్రితం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి నివాసంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో అనూహ్యంగా పాచిపెంట మండల అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ ముఖి సూర్యనారాయణని మండల అధ్యక్షులుగా సంధ్యారాణి తెరపైకి తెచ్చారు. దీంతో ప్రశాంతంగా ఉన్న పార్టీలో రచ్చ మొదలైంది. బుధవారం పార్టీ మండల సమావేశాన్ని పిన్నింటి ప్రసాద్‌బాబు నిర్వహించారు. అధిష్టానం ఆదేశాల మేరకే తాను సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. తనను పార్టీ అధ్యక్షులుగా తొలగించినట్లు రాష్ట్ర నాయకత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు నిర్వహించే టెలి కాన్ఫరెన్స్‌లో మండల అధ్యక్షులుగా తానే పాల్గొన్నట్లు రుజువు చేశారు. 1983 నుంచి పార్టీలో కొనసాగుతున్న తన కుటుంబానికి ఏనాడూ పార్టీ అన్యాయం చేయలేదని, తాము కూడా పార్టీకి ద్రోహం చేయలేదని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పార్టీ ఎవరిని నిర్ణయించినా గెలుపు కోసం పని చేస్తామని స్పష్టం చేశారు.

పార్టీ పరిణామాలపై భంజ్‌దేవ్ ఆగ్రహం

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలిసింది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి ఏకపక్ష నిర్ణయాలపై ఆయన అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్ళినట్లు సమాచారం. కొద్దిరోజుల క్రితం ఆర్‌పి భంజ్ దేవ్‌ని సంధ్యారాణి అనుచరులు బుజ్జగించేందుకు ప్రయత్నించగా, ఆయన ససేమిరా అన్నట్లు తెలిసింది. పార్టీ ఏ ఒక్కరి సొత్తు కాదని, సమిష్టి నిర్ణయాల మేరకు కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని బదులిచ్చినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.

అధిష్టానం ఆరా

నియోజకవర్గంలో పార్టీలో కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలపై రాష్ట్ర నాయకత్వం ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. సుదీర్ఘ కాలంగా పార్టీలో కొనసాగుతున్న పిన్నింటి ప్రసాద్ బాబుని అనూహ్య రీతిలో తప్పించడం, కొత్తగా మండల అధ్యక్షులుగా ముఖి సూర్యనారాయణని ఎన్నుకోవడం వంటి పరిణామాలు రాష్ట్ర నాయకత్వం దృష్టికి వెళ్లాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక పవనాలు బలంగా వీస్తున్న సమయంలో నియోజకవర్గ పార్టీలో నెలకొన్న పరిస్థితులను గమనిస్తున్న అధిష్టానం సీరియస్‌గా ఉన్నట్టు తెలిసింది.



మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ఎస్‌పి విక్రాంత్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పార్వతీపురం మన్యం జిల్లా నూతన ఎస్‌పిగా విక్రాంత్ పాటిల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి తొలిసారిగా చేరుకున్న విక్రాంత్ పాటిల్‌కు పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని వెల్లడించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఆయనను అభినందించి, కొత్త జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి సహకరించాలని కోరారు.

మోడీని గద్దె దింపండి

- సిపిఎం రాష్ట్ర నాయకులు కె.సుబ్బరావమ్మ
- ప్రచారభేరి విజయవంతం చేయాలని పిలుపు

ప్రజాశక్తి-కలెక్టరేట్



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు కె.సుబ్బరావమ్మ

నిరంకుశంగా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రధాని మోడీని గద్దె దింపాలని సిపిఎం రాష్ట్ర నాయకులు కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.గంగునాయుడు అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడీ విధానాలు దేశానికి, రాష్ట్రానికి నష్టదాయకంగా తయారయ్యాయని చెప్పారు. కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తూ, ధరలు పెంచి ప్రజలపై భారాలు వేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వీటిపై పోరాటాలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీలపై సిబిఐ, ఇడిని ఉపయోగిస్తూ నిరంకుశంగా దాడికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్ ఇవ్వకుండా కేంద్రం మోసం చేసిందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలని చూస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రానికి బిజెపి తీవ్ర ద్రోహం చేసిందని దుయ్యబట్టారు. బిజెపి నిరంకుశ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 14 నుంచి 30 వరకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ప్రచారభేరి చేపడుతున్నట్లు తెలిపారు. 14న అంబేద్కర్ విగ్రహాల వద్ద ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. 15 నుంచి 30 వరకు గ్రామ, మండల స్థాయిల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

అనంతరం సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపిని అధికార పార్టీ వైసిపి, ప్రతిపక్ష పార్టీలు టిడిపి, జనసేన మోస్తున్నాయని విమర్శించారు. బిజెపి మతోన్మాద, ప్రజా వ్యతిరేక చర్యలను ఖండించాలని, వామపక్షాలు చేపట్టే పోరాటంలో కలిసి రావాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ ప్రచార బేరిని విజయవంతం చేయాలని, ప్రజలంతా కలిసి రావాలని కోరారు. అనంతరం నాయకులు డి.రమణారావు, జగన్నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.మన్మథరావు, వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై నాయుడు, రెడ్డి లక్ష్మునాయుడు, కొల్లి సాంబమూర్తి, జి.వెంకటరమణ, కె.రామస్వామి, కోరాడ ఈశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యతరగతి కోసమే టౌన్‌షిప్‌లు


డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

మధ్యతరగతి ఆదాయ వర్గాల కోసం జగనన్న స్మార్ట్‌టౌన్ షిప్‌లు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. బుధవారం పట్టణానికి చెందిన బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో రెండు లేఅవుట్లు వేస్తున్నట్లు చెప్పారు. అన్ని సౌకర్యాలతో 184 ప్లాట్ల రూపకల్పన బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యాన జరిగిందని తెలిపారు. 14.87 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్న 29 మంది రైతులకు పరిహారంగా రూ.2.88 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఎకరాకి 19.39 లక్షలు పరిహారంగా ఇప్పించామన్నారు. ప్రభుత్వ భూమి అయినప్పటికీ రైతులు అనేక సంవత్సరాలుగా సాగులో ఉంటూ దాన్ని కాపాడినందున వారికి పరిహారం ఇప్పించినట్లు చెప్పారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో 9.47 ఎకరాల విస్తీర్ణంలో 109 ప్లాట్లు వేస్తున్నట్లు వివరించారు. దుర్గసాగరం రోడ్డును ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో 5.4 ఎకరాల విస్తీర్ణంలో 75 ప్లాట్లు వేస్తున్నట్లు తెలిపారు. ఈ లేఅవుట్లలో రహదారులు, తాగునీటి సరఫరా, డ్రెయినేజీ వ్యవస్థ, పార్కు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.8.61 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. భూమికి విలువ క్రమేణా పెరుగుతున్న నేపథ్యంలో రూ.18 లక్షల లోపు ఆదాయ వర్గాల ప్రజలు ప్లాట్లను కొనుగోలు చేసుకోవచ్చని చెప్పారు. బుడా చైర్‌పర్సన్ ఇంటి పార్వతి మాట్లాడుతూ 150, 200, 240 చదరపు గజాల విస్తీర్ణంలో ప్లాట్లను వర్గీకరణ చేసినట్లు చెప్పారు. జాతీయ రహదారి ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో చదరపు గజం రేటు రూ.5 వేలని, దుర్గసాగరం లేఅవుట్‌లో గజం రేటు రూ.4,800 అని తెలిపారు. పట్టణ పరిధిలో ఉన్న లేఅవుట్లలో రేట్లను పరిశీలించిన తర్వాత జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో కూడిన కమిటీ సభ్యులు రేట్లను నిర్ణయించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, అర్బన్ బ్యాంకు అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి పట్టణ మాజీ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు, జగనన్న సచివాలయాల కన్వీనర్ గిరి రఘు, కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, రాపాక మాధవరావు, బుడా అధికారులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

1370 మందికి ఇబిసి నేస్తం

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలో 1370 మందికి వైఎస్ఆర్ ఇబిసి నేస్తం నిధులు బుధవారం విడుదల అయ్యాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో నిర్వహించిన ఇబిసి నేస్తం కార్యక్రమానికి కలెక్టర్ నిశాంత్‌కుమార్ కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. రెండో విడత (2022-23) కింద జిల్లాకు చెందిన 1370 మంది మహిళా లబ్ధిదారులకు రూ.2.055 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి బటన్ నొక్కి జమ చేశారు. మొదట విడత (2021-22)లో 1082 మంది మహిళా లబ్ధిదారులకు రూ.1.62 కోట్లు విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, బిసి కార్పొరేషన్ ఎఇఒ గోపి, పలువురు అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజా కళాకారుడు.. సఫ్దార్ హష్మి

ప్రజాశక్తి కలెక్టరేట్



హష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

సఫ్దార్ హష్మి ప్రజా కళాకారుడని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ అన్నారు. స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సఫ్దార్ హష్మి జయంతి సభను బుధవారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ హష్మి.. రాజకీయ, ఆధునిక వీధి నాటక ప్రక్రియకు ప్రాణం పోసిన మహనీయుడని కొనియాడారు. ప్రజల పక్షాన నిలిచి ప్రజా సమస్యలకు ప్రాధాన్య రచనల కోసం మొగ్గు చూపారన్నారు. 1989 జనవరి 1 ఢిల్లీ సమీపంలో పారిశ్రామిక ప్రాంతంలో అల్లా బోల్ అనే వీధినాటికను ప్రదర్శిస్తుండగా హఠాత్తుగా కొందరు రాజకీయ దుండగులు దాడి చేశారని, హష్మిని నడివీధిలో హత్య చేసి పారిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. హష్మి భార్య మల్య శ్రీ హష్మి ఆధ్వర్యంలో మరుసటి రోజు కళారూపాలు ప్రదర్శించి వేలాది మందికి స్ఫూర్తిని ఇచ్చారని తెలిపారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఎలా ఆపలేమో.. హష్మిని హత్య చేసినంత మాత్రాన ప్రజాకళలను ఆపలేరని, ప్రజా ఉద్యమాలను ఆపలేరన్నారు. ప్రజాకాలను హష్మి ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లే బాధ్యత అందరిపైన ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులు హేమరక రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 171 మంది ఎంపిక

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పార్వతీపురంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో అరబిందో ఫార్మా పరిశ్రమ జాబ్‌మేళాను బుధవారం ఏర్పాటుచేసింది. సుమారు 283 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 171 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చలపతిరావు తెలిపారు. జాబ్‌మేళా నిర్వహించడం ఐదోసారి అన్నారు. ఇలాంటి అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న డిఎస్‌డిఒ సాయికుమార్



ర్యాలీ చేపడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిరంజీవులు, కార్యకర్తలు

ప్రజల నడ్డి విరుస్తున్న వైసిపి


ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో 8 సార్లు విద్యుత్తు ఛార్జీలు పెంచి, ప్రజల నడ్డి విరుస్తోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు అన్నారు. మండలంలోని జమదాల బిసి కాలనీలో బుధవారం నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు ఛార్జీల పెంపుతో రూ.57,188 కోట్లు వసూలు చేస్తున్న జగన్ రెడ్డి ఆ డబ్బును ఏం చేస్తున్నారు? ఎన్ని విద్యుత్తు ప్రాజెక్టులు కట్టారు? కొత్తగా ఎన్ని ఊళ్లకు కనెక్షన్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్‌చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టి రైతుల మెడకు ఉరితాళ్లు బిగిస్తున్న ఈ ప్రభుత్వాన్ని ఎప్పుడు వదిలించుకుందామని ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు డి.మోహన్‌రావు, ఎంపిటిసి శ్రీనివాసరావు, అరకు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట నాయుడు, బోను చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అందరికీ లబ్ధి

'జగనన్నే మా భవిష్యత్తు'లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ప్రజాశక్తి-సీతానగరం



ప్రచార పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సంక్షేమ పథకాలకు అర్హులందరికీ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. బుధవారం మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైసిపి నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక చేకూరిన లబ్ధి, పొందిన ప్రయోజనాలతో పాటు గత ప్రభుత్వంలో మోసపోయిన, మోసగించిన విధానాన్ని ప్రజలకు ఆయన వివరించారు. రెండు ప్రభుత్వాలకు మధ్య ఉన్న వ్యత్యాసం తెలియజేశారు. ప్రజలందరికీ ఎంతో మేలు చేస్తున్న ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్షాలు, పగటివేషగాళ్లు లేనిపోని కల్లబొల్లి మాటలు, అబద్ధాలు చెపుతారని వాటిని ఏమీ పట్టించుకోవద్దన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మామిడి బాబ్జీ, నాయకులు బలగ శ్రీరాములు నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, మాజీ జెడ్‌పిటిసిలు అంబటి కృష్ణంనాయుడు, తెంటు వెంకట అప్పలనాయుడు, సీనియర్ నాయకులు పోల ఈశ్వరనారాయణ, ఆర్‌వి, సర్పంచ్ చింతాడ కృష్ణ, ఎస్.తిరుపతి రావు, అంటిపేట ఉపసర్పంచ్ బి.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

టీకా నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

హైరిస్క్ ప్రాంతాల్లో పిల్లలకు పూర్తి స్థాయిలో టీకా నిర్వహణపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. బుధవారం పట్టణ శివారు ప్రాంతాలను సందర్శించి, పిల్లల టీకా కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం మూడో వార్డులో వైద్య సిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆర్‌సిహెచ్ రిజిస్టర్లను పరిశీలించారు. వేసవి రీత్యా వ్యాక్సిన్ ఉష్ణోగ్రత స్థితిని ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది పరిశీలించాలని సూచించారు. గర్భిణులకు, పిల్లలకు వేస్తున్న టీకాలు, వాటి ఆవశ్యకతపై డిఐఒ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, ఎఎన్ఎం దుర్గమ్మ పాల్గొన్నారు.



గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న డిఐఒ జగన్మోహనరావు



ఇంజినీర్లతో మాట్లాడుతున్న సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి

రహదారి విస్తరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తరణ పనులను బుధవారం సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ రహదారి విస్తరణ పనులు ఎప్పుడు ప్రారంభించారు, పనుల్లో జాప్యం, తదితర అంశాలపై ఐటిడిఎ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.మురళిని అడిగి తెలుసుకున్నారు. మే 7, 8, 9 తేదీలలో వీరఘట్టంలో పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా రహదారి నిర్మాణ పనులు మొదటి లేయర్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇఇ వివరణ ఇచ్చారు. పండగకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరు చంద్రశేఖర్‌ను పిఒ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి జెఇ జగన్మోహన్ పాల్గొన్నారు.

విడివిసిలతో గిట్టుబాటు ధర

ప్రజాశక్తి-సాలూరు రూరల్

అటవీ ఉత్పత్తులను వన్‌ధన్ వికాస్ కేంద్రాలకు విక్రయిస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని ఎపిఎం జి.సింహాచలం తెలిపారు. మండలంలోని గిరి శిఖర పంచాయతీ పట్టుచెన్నూరులో వైకెపి సిబ్బందితో కలిసి మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకు గిట్టుబాటు ధర లేక, తూకం సరిగా లేక, దళారుల బెడద విపరీతంగా ఉండటం వల్ల గిరిజనులు నష్టపోతున్నారని, అందుకే వన్‌ధన్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. గిరిజనులు పండించే పంటలను విడివిసిలకు విక్రయిస్తే నగదును నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఎపిఎం జయకుమార్, డిజిఎం సత్యనారాయణ, సిసిలు రామకృష్ణ, వాసు పాల్గొన్నారు.



ప్రయివేటు ఆస్పత్రిలో తనిఖీలు చేపడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

ప్రయివేటు ఆస్పత్రుల్లో డిఎంహెచ్ఒ తనిఖీలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురంలో స్వామి ఆసుపత్రి, సాలూరులో రఘు నర్సింగ్ హోంలో డిఎంహెచ్ఒ బగాది జగన్నాథరావు బుధవారం తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆస్పత్రులు, నర్సింగ్ హోంల నిర్వహణ ఉండాలని ఆయన స్పష్టంచేశారు. ఆసుపత్రుల్లో బయో మెడికల్ వేస్ట్ నిర్వహణ పక్కాగా ఉండాలని ఆదేశించారు. నిర్దేశిత రంగుల డస్ట్ బిన్లు ఉండాలని, వాటిని శాస్త్రీయ పద్ధతిలో డిస్పోజల్ చేయాలని సూచించారు. అన్ని ఆసుపత్రుల్లో అగ్నిమాపక యంత్రాల స్థాయికి తగిన విధంగా ఉండాలన్నారు. ల్యాబ్‌లో చేసిన పరీక్షలలో గుర్తించిన డెంగీ, మలేరియా తదితర కేసుల సమాచారాన్ని అందజేయాలన్నారు.

16న 'సత్యకైలాస్'లో నవోదయ మోడల్ టెస్ట్

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

పెదమేరంగి జంక్షన్‌లోని శ్రీ సత్య కైలాస్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 16న నవోదయ మోడల్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ రౌతు అజయ్ కుమార్ తెలిపారు. విద్యార్థులలో పరీక్షలపై భయాన్ని పోగొట్టేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 8985388669, 9441349051 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రాల పరిశీలన


ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని వెంకంపేట అంగన్వాడీ కేంద్రాలను బుధవారం ఐసిడిఎస్ పిఒ శ్రీనివాసరావు పరిశీలించారు. అద్దెగదుల్లో నిర్వహిస్తున్న కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు తగిన మౌలిక వసతులపై ఆరాతీశారు. రక్తహీనతను నిర్మూలించేందుకు వారికి అందించాల్సిన మాత్రలు సక్రమంగా పంపిణీ జరుగుతున్నది, లేనిది లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్లను, చిన్నారి కౌసలాన్ని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు జేజేలు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి చట్టబద్ధత గ్రామసభలు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని ఈ నెల 14 నుంచి 16 వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో చట్టబద్ధత గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వై.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామసభలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.



బీమా సాయం అందజేస్తున్న సర్పంచ్

బీమా సాయం అందజేత

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలో రావికోన పంచాయతీలో ఆర్‌కె బట్టివలస గ్రామంలో ఇటీవల మృతి చెందిన పీడక అయ్యప్ప భార్య సావిత్రమ్మకు బీమా సాయం రూ.10 వేలను బుధవారం సర్పంచ్ కద్రక రామస్వామి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రామకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

కళాశాల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పూసపాటిరేగ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమణకు పాల్పడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తమరాపు నగేష్ కుమార్, సర్పంచ్ టొంపల సీతారాం బుధవారం పోలీసులకి ఫిర్యాదు చేశారు. కళాశాల నిమిత్తం 1984లో 10 ఎకరాల రెండు సెంట్లు భూమిని తిరుమలరాజు అప్పల వెంకటరామరాజు భూదాన పట్టాగా అగ్రిమెంట్ చేశారన్నారు. ఇప్పుడు ఆ భూమిని తిరిగి స్వాధీన పరుచుకునేందుకు ఆ స్థలంలో ఆయన కుటుంబీకులు ఫెన్సింగ్ వేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చలివేంద్రాల జాడేదీ..?

- తాగునీటికి బాటసారుల కష్టాలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కురుపాం

రోజురోజుకూ పెరుగుతున్న భానుడి ఉష్ణతాపం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఉదయం 9 గంటలు దాటిందంటే చాలు మండలంలోని ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామాలతోపాటు మండల కేంద్రాల్లోనూ తాగునీటి చలివేంద్రాలు ఎక్కడా కనిపించడం లేదు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇందులో ప్రధానంగా చలివేంద్రాల ఏర్పాటుకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆలోచన అధికారులకు లేకపోవడంతో ప్రజలు దాహార్తితో ఇబ్బంది పడుతున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు మండలంలో ఎక్కడా పంచాయతీ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, నాయకులు చలివేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో బాటసారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



దాతల సాయంతో ఏర్పాటు చేసిన చలివేంద్రం (ఫైల్)

మండల కేంద్రానికి నిత్యం ప్రజలు వివిధ పనులపై రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇప్పటికే ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖ అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. మండల కార్యాలయాలకు వివిధ పనులపై దూర ప్రాంతాల నుంచి మండుటెండలో వస్తున్న ప్రజలకు కనీసం మంచినీటి సౌకర్యం కల్పించలేదు. మండల కార్యాలయాల వద్ద ఎక్కడా చలివేంద్రం లేకపోవడంతో మంచినీరు కొనుక్కున్న దాహార్తిని తీర్చుకుంటున్నారు. గ్రామాల్లో చలివేంద్రాలను ఇటు అధికార యంత్రాంగం.. అటు పాలకులు ఏర్పాటు చేయకపోవడంతో చలివేంద్రాల ఏర్పాటుకై దాతల సహాయార్థం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేస్తే వాటికి అయ్యే ఖర్చులకు నిధులు ఎవరు ఇస్తారనేది ప్రశ్నార్థకంగా మారడంతో గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటుకు ముందుకు రావడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అధికారులు ఈ ఏడాది చలివేంద్రాలు ఏర్పాటు చేసే ఆలోచనలు లేనట్టేనా? అని ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు మేల్కొని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు 24 వరకు గడువు

ప్రజాశక్తి-కలెక్టరేట్

గురుకులాల్లో ప్రవేశానికి ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేయవచ్చని డిఇఒ ఎస్.డి.వి.రమణ తెలిపారు. గురుకులాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలో 2023 - 24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. బుధవారం డిఇఒ కార్యాలయంలో గురుకుల విద్యాలయాల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ఐదో తరగతితోపాటు 6, 7, 8 తరగతుల బ్యాక్‌లాగ్ ఖాళీలకు, ఇంటర్మీడియట్, డిగ్రీలో ప్రవేశాలకు http://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను 24వ తేదీ వరకు సమర్పించవచ్చని చెప్పారు. మే 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. జిల్లా పరీక్షల కన్వీనర్ కె.రఘునాథ్ మాట్లాడుతూ 12 గురుకుల పాఠశాలలు, 3 జూనియర్ కళాశాలల్లో మైనారిటీ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష లేకుండా మే 15 నుంచి నేరుగా ప్రవేశం కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విద్యా శాఖ సహాయ సంచాలకులు ఎం.ఇ.రమా జ్యోతి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

1998 డిఎస్‌సి పోస్టుల భర్తీకి కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

1998 డిఎస్‌సి పోస్టుల భర్తీకి బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. క్వాలిఫై అయిన 504 మందికి గాను ఖాళీగా ఉన్న 489 పోస్టులకు కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేసే ప్రక్రియను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా భర్తీకి నోచుకోని పోస్టులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నెరవేర్చారని తెలిపారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి , రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో ఈ అవకాశం కలిగిన మీరంతా సమాజంలో ఉన్నతమైన స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ డాక్టర్ ఎం.అశోక్ కుమార్, డిప్యూటీ సిఇఒ రాజ్ కుమార్, డిఇఒ లింగేశ్వర్ రెడ్డి, అభ్యర్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిఎఫ్ఎంఎస్‌ను రద్దు చేయాలి

ధర్నాలో అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-విజయనగరం

ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను గతంలో మాదిరిగానే చెల్లింపులు చేయాలని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిఎఫ్ఎంఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జెఎసి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగుల డిమాండ్లపై గత నెల నుంచి దఫా దఫాలుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నామని, అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడంతో ఆందోళన ఉధృతం చేస్తున్నామని చెప్పారు. ఉద్యగులకు సంబంధించిన డిఎ, జిపిఎఫ్, పిఆర్‌సి తదితర వాటి ఎరియర్స్ వివరాల లెక్కలు చెప్పని ప్రభుత్వం మిగతా పనులు ఏవిధంగా చేస్తుందో అర్థం కావడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సంఘాలకు అతీతంగా ఉద్యోగులంతా ఉద్యమాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజు, తాడ్డి గోవింద్, యడ్ల గోవింద, శంకరరావు, సూర్య తదితరులు పాల్గొన్నారు.




ధర్నాలో మాట్లాడున్న అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఇన్‌ఛార్జితో కలిసి వెళ్లాల్సిందే

టిడిపి కురుపాం నియోజకవర్గ పరిశీలకులు మహేష్

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

నియోజకవర్గ ఇన్‌ఛార్జితో కాకుండా వేరుగా కార్యక్రమాలను నిర్వహించకూడదని టిడిపి నియోజకవర్గ పరిశీలకులు ఎ.మహేష్‌బాబు.. పార్టీ నాయకులకు సూచించారు. అధిష్టానం నిర్ణయించిన ఇన్‌ఛార్జితో కాకుండా వేరేగా కార్యక్రమాలు నిర్వహిస్తే, పార్టీ ఉల్లంఘన కిందే వస్తుందని హెచ్చరించారు. చినమేరంగిలో మాజీమంత్రి శత్రుచర్ల విజయ రామరాజు నివాసంలో బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యాన అత్యవసర సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగుర వేయడానికి ఇప్పటి నుండే సన్నాహకాలు మొదలెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇన్‌ఛార్జి జగదీశ్వరి మాట్లాడుతూ బూత్ లెవెల్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు ఓటర్ పరిశీలన, గృహాల మ్యాపింగ్ త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ పరిశీలకులు మహేష్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీలో జగన్నాథపురంలో 2, 29, 30 వార్డులలో పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు శంకుస్థాపన చేశారు. ప్రధానంగా ఎర్ర కంచెమ్మ గుడికి ఎదురుగా కాలువ నిర్మాణం, తాగునీటి ట్యాంకు ఆధునీకరణ, పాత్రుని గారి కోనేరు సుందరీకరణ పనులు చేపడుతున్నారు. పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు ఆర్.చిన్నంనాయుడు, వై.త్రినాథ, ఆర్.బంగారి నాయుడు, వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఎమ్మెల్యే కళావతి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-వీరఘట్టం

ఎమ్మెల్యే వి.కళావతి సోదరుడు విశ్వాసరాయి లక్ష్మణరావు మృతి చెందిన విషయం తెలుసుకున్న డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర బుధవారం మండలంలోని వండువ గ్రామానికి చేరుకొన్నారు. ఎమ్మెల్యే కళావతి కుటుంబాన్ని పరామర్శించారు. సోదరుడు లక్ష్మణరావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపిపి ధమలపాటి వెంకటరమణ నాయుడు, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ హిమరకం, వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, సర్పంచ్ ఎం.కళ్యాణి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్రీ లీలా ప్రసాదరావు, వివిధ శాఖల అధికారులు, అభిమానులు పాల్గొని, నివాళులర్పించారు.



లక్ష్మణరావు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

మేడపై నుంచి దూకి చిరువ్యాపారి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఐస్ ఫ్యాక్టరీ కూడలిలో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగించేందుకు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. అయితే చిన్న చిరు దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి తన పొట్ట కొట్టొద్దని, కొద్దిరోజులు సమయం ఇస్తే తొలగిస్తానని అధికారులను వేడుకున్నాడు. అయినా పురపాలకశాఖ అధికారులు గడువు ఇవ్వడం కుదరదని చెప్పి జెసిబితో ఫుట్‌పాత్‌పై ఉన్న వాటిని తొలగించారు. దీంతో దుకాణ నిర్వాహకుడు రమణ మేడపైకి ఎక్కి విద్యుత్ వైర్లను పట్టుకునేందుకు ప్రయత్నించాడు. అప్పటికే అక్కడకు చేరుకున్న రెండవ పట్టణ సిఐ విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్‌ను నిలిపి వేయించారు. దీంతో రమణ మేడపై నుంచి దూకేశాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని వెంటనే కేంద్రాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఎసిపి మధుసూదనరావు మాట్లాడుతూ ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ లో కాలువలపై ఆక్రమణలు ఉన్నాయని, కాలువల్లో పూడికలతో నిండిపోయి ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈనేపథ్యంలో తొలగింపునకు చర్యలు చేపట్టామని తెలిపారు.



మేడపై నుంచి దూకేందుకు ప్రయత్నిస్తున్న వ్యాపారి రమణ

టిడిపిలోకి ఇద్దరు సర్పంచులు..

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలోని వైసిపికి చెందిన ఇద్దరు గిరిజన సర్పంచులు బుధవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. డెన్సరాయి సర్పంచ్ మామిడి చిన్నమ్మి, సంపంగిపాడు సర్పంచ్ గుడియా చంద్రయ్య నాయకత్వంలో రెండు పంచాయతీలకు చెందిన గిరిజన కుటుంబాలు టిడిపిలో చేరాయి. టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్ ఆధ్వర్యాన రూడి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారపార్టీకి గిరిజన మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు.గత కొన్ని సంవత్సరాలుగా గ్రామాల సమస్యలు పరిష్కరించడంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర, వైసిపి మండల నాయకులు విఫలమయ్యారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గిరిజన నాయకులు కె.లక్ష్మణరావు, దొర లక్ష్మణ రావు, మండల నాయకులు భాస్కరరావు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారికి కండువా వేస్తున్న సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-పాలకొండ

జగనన్న అర్బన్ లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో హౌసింగ్, మున్సిపల్, సచివాలయ సిబ్బందితో అర్బన్ గృహనిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని చెప్పారు. లే అవుట్‌లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

సాయినగర్ కాలనీలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని సాయినగర్ కాలనీలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, మధుమేహం, బిపి బాధితులతోపాటు జ్వరపీడితులకు తనిఖీలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పార్వతి, నవనమ్మ, టెక్నీషియన్ దినేష్, ఎఎన్ఎం ఉష, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

వాహనాల రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-పాచిపెంట

పాచిపెంట మండల కేంద్రంలో ఆర్అండ్‌బి రహదారి వద్ద గడ్డి ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో గంటల తరబడి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రహదారి అంతా గోతులమయం కావడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. బుధవారం ఘటనా స్థలం వద్ద సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన స్థానికులు నిరసన చేపట్టారు. కొత్తగా రహదారి నిర్మించి, కల్వర్టు ఏర్పాటు చేయాలని ఈశ్వరరావు అధికారులను డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గోలి రామారావు, జరజాపు శ్రీను, పిన్నింటి రామ, తదితరులు పాల్గొన్నారు.



బోల్తా పడిన ట్రాక్టర్